క్లుప్తంగా

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు : నారపుర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను తిలకించడానికి వచ్చిన వారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వల్లంబాయి గారి హృషికేశవరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం సీనియర్ ఎద్దుల పోటీలలో పాల్గొన్న రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నదానం చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ పి. నరేన్ రామాంజులు రెడ్డి

చింతకొమ్మదిన్నె : కొప్పర్తి పంచాయితీ పరిధిలోని ఎర్రమాచుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి. నరేన్ రామాంజులు రెడ్డి రూ. లక్ష విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, సర్పంచ్‌లు మల్లికార్జున యాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకటం లక్ష్మీ నారాయణ రెడ్డి, నాగమల్లారెడ్డి, చిన్న సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎస్ఐ హాజీవలీ, తదితరులు

పులివెందుల టౌన్ : యువ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని ట్రాఫిక్ ఎస్ఐ హాజీవలీ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన బెల్ట్‌టెస్ట్ పోటీలలో అకాడమీ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ ఆత్మ రక్షణ కోసం కరాటే ఒక ఆయుధం లాంటిదన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, అకాడమీ మాస్టర్ దినేష్, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లె, రామిరెడ్డిపల్లె, అయ్యవారిపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ జేఈ కె.శివ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అలాగే చింతలమడుగుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని జేఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పొన్నతోట గ్రామంలోని దేవాలయం వద్ద ప్రభుత్వ పథకాల గురించి ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జమ్మలమడుగు మండల పరిధిలోని పొన్నతోట, నర్సోజి కొట్టాల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతోందని తెలిపారు. టీడీపీ పాలనలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూరేదన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదన్నారు. వలంటీర్లు తమకు కేటాయించిన వార్డుల్లో తిరుగుతూ అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా గాని, ఫోన్ ద్వారా గాని తనకు తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురుస్వామి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, నక్క గురప్ప, నారాయణ, బాలయ్య, సుంకన్న, సుబ్బరాయుడు, వెంకటేశు, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న సుంకులమ్మ తిరునాలలో భాగంగా రెండోరోజు శనివారం అమ్మవారికి మహా గణపతి పూజ, అభిషేకాలు, అవాహిత హోమములు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు చవ్వారెడ్డి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణ రెడ్డి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తిరునాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రహంతుల్లా, ఉత్తమా రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఆర్ వీఎస్ఆర్, ఇర్ఫాన్, రెడ్డి కరీం తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం రాజ మార్గం



కక్షిదారులను రాజీ చేస్తున్న మెజిస్ట్రేట్ లావణ్య



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ఎస్. భార్గవి

కమలాపురం : కేసుల పరిష్కారంలో రాజీ మార్గం రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్. లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 302 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 300 క్రిమినల్, 2 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కక్షిదారులను ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పుష్పరాజు, మహేశ్వర్‌రెడ్డి, మహేష్, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : కక్షిదారులు స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ మార్గమే రాజమార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్. భార్గవి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న కేసుల వల్ల కాలయాపనతో పాటు డబ్బు వృథా అవుతుందన్నారు. కక్షిదారులు కేసులు రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమని ఆమె సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1151 కేసులు పరిష్కరించి 13 లక్షల 44వేల 242 రూపాయలు కక్షిదారులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, సీఐలు సదాశివయ్య, కొండారెడ్డి, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

చెన్నూరు : మండలంలోని కొక్కరాయిపల్లె దళితవాడకు చెందిన దలాయిచంద్ర (35) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని కొక్కరాయపల్లె మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, పుల్లారెడ్డిలు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ ఉన్నారు.

నేడు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి షుగర్ పరీక్షల అనంతరం సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా ఆసుపత్రి వద్దకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏపీహెచ్ఆర్ఎంసీ సభ్యుడు ఈశ్వర్‌రెడ్డికి సన్మానం

వీరపునాయునిపల్లె : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ మండలి (ఏపీహెచ్ఆర్ఎంసీ) సభ్యుడు ఎస్‌పీ ఈశ్వరరెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శనివారం ఆయన స్వగ్రామమైన అనిమెలకు వచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వీఆర్‌యస్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్స్‌పల్ కేశవరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అనిమెల గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఈశ్వర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం వీరపునాయునిపల్లె మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, యరమలపల్లె సర్పంచ్ సౌజన్యరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌యాదవ్, శ్రీనివాసులరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు సన్మానించారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్

చెన్నూరు : సొంత స్థలాలలో నిర్మించుకుంటూ వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. శనివారం వారు చెన్నూరులోని అరుంధతి నగర్, గాంధీనగర్‌లలో పర్యటించి అక్కడి గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో ఇచ్చేందుకు వీలవుతుందన్నారు. కనపర్తి లేఅవుట్లలో నిర్మించే జగనన్న కాలనీలలో కూడా గృహ నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మేనిల్, పంచాయతీరాజ్ ఏఈ మురళి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుజిత తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో వైద్య సేవలు మరింత చేరువ



క్షయ, కుష్టు వ్యాధిపై జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలీ

వల్లూరు : ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ అయ్యాయని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలీ పేర్కొన్నారు. వల్లూరు మండలంలోని చిన్న లేబాక గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పథకం అమలుకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు,, రక్త హీనత నివారణకు చేపడుతున్న చర్యల గురించి చర్చించారు. అలాగే క్షయ, కుష్టు వ్యాధి గ్రస్తులపై జరుగుతున్న సర్వే గురించి ఆరా తీశారు. అనంతరం కుమారునిపల్లెలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఫణీంద్ర, వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు ఎమ్మెల్యే నైజం కాదు



మాట్లాడుతున్న కాపు నేత శ్రీరాం రమణ

కమలాపురం : హత్యా రాజకీయాలు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి నైజం కాదని, అది టీడీపీ వారి స్వభావమని వైఎస్సార్ సీపీ కాపు నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ శ్రీరాం రమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతోమాట్లాడారు. కడపకు చెందిన టీడీపీ నేత హరిప్రసాద్ కమలాపురం రాజకీయాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే కాపులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కేసుల విషయంలో ఎమ్మెల్యే పాత్ర ఏ మాత్రం లేదన్నారు. గత టీడీపీ పాలనలో కాపులపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో, అత్యాచారం తదితర కేసులన్నీ అక్రమంగా పెట్టారని గుర్తుచేశారు. అప్పుడు హరి ప్రసాద్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాపు నేతల టీవీ సుబ్బరాయుడు, హరి, బ్రహ్మయ్య, వీరారెడ్డి, చక్రపాణి, లక్ష్మీరెడ్డి, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి పవన్‌కల్యాణ్‌కు లేదు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి పవన్‌కల్యాణ్‌కు లేదని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడా రు. పవన్‌కల్యాణ్ తీరు జనసేన కార్యకర్తలనే అయోమయానికి గురిచేసేలా ఉందన్నారు. రోజుకో మాట, గంటకో మాట, నిముషానికి ఒకలా ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎవరైనా ఎన్నికల సమయంలో పొత్తులు పెట్టుకుంటారని, ఈయన ఎన్నికలు రాక ముందే పొత్తులకు తహతహలాడుతున్నాడన్నారు. ఎన్నికల్లో పొత్తు ఉంటుంది అంటూనే మళ్లీ దానికి విధి విధానాలు తయారు కాలేదని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ప్యాకేజీ ఇంకా ఖరారు కానందునే పొత్తుపై విధివిధానాలు తయారు కాలేదని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. జనసేన పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలు పరిగణలోకి తీసుకోకుండా, పార్టీని తీసుకుపోయి చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నాడన్నారు. కులానికి, ప్రాంతానికి ముడిపెట్టి రాజకీయాలు చేస్తున్నారన్నారు. స్పందన లేని వాడు నాయకుడు కాలేడని, పవన్ కల్యాణ్ కూడా ఆ కోవలోకే వస్తాడన్నారు. సినిమాల్లో మాత్రమే ఆయన స్టార్ అని, రాజకీయాల్లో అలా అనిపించుకోవాలంటే ప్రజలకు మంచి చేయాలన్నారు. పార్టీ ఎందుకు పెట్టాడో కూడా పవన్ కల్యాణ్‌కు తెలియడం లేదన్నారు. ఆంధ్రా రాజకీయాల్లో ఆయన చివరికి కమెడియన్‌గా కూడా నిలవలేడని జోస్యం చెప్పారు. తన మనుగడ కోసం, ప్యాకేజీ కోసమే పవన్‌కల్యాణ్ జనం వద్దకు వస్తున్నారని, ఆ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

మాకు న్యాయం చేయండి



మీడియాకు మొర పెట్టుకుంటున్న మైనర్లు ధరణేష్, యశోద

పులివెందుల టౌన్ : తమకు అధికారులు న్యాయం చేయాలని.. తమ అమ్మమ్మ ఆస్తిని తమకు దక్కకుండా కాజేయాలని రోడ్డున పడేయాలని చూస్తున్నారని మైనర్లు ధరణేష్, యశోద మీడియాతో మొర పెట్టుకున్నారు. శనివారం స్థానిక ఇందిరమ్మ రాణితోపు వద్ద వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల తమ అమ్మమ్మ సుంకమ్మ మృతి చెందడంతో ఆమె పేరు మీద ఉన్న ఆస్తిని హోంగార్డు భాస్కర్ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. ఆస్తి కోసం వస్తే చంపుతానని బెదిరించడం జరుగుతుందన్నారు. తమ తల్లి సోనియా, తండి చంద్రశేఖర్, అమ్మమ్మ సుంకమ్మ అందరం కలసి ఒకే ఇంట్లో ఉండేవారమని.. తమ తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో తండ్రి తాగుడుకు బానిసై ఇల్లు వదిలి ఎక్కడికో వెళ్లిపోయారన్నారు. అప్పటి నుంచి అమ్మమ్మ సుంకమ్మ దగ్గర ఉండేవారమన్నారు. అయితే కొద్ది నెలల క్రితం అమ్మమ్మ అనారోగ్యం బారిన పడటంతో తాము మైనర్లు కావడం వల్ల సుంకమ్మ మేనల్లుడైన భాస్కర్‌ను ఆశ్రయించామన్నారు. సుంకమ్మ ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఇదే ఆసరాగా తీసుకున్న భాస్కర్ ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో మమ్మల్ని బయటకు గెంటేయడం జరిగిందన్నారు. కొద్దిరోజుల క్రితం సుంకమ్మ మృతి చెందడం జరిగిందన్నారు. ఆమె మృతి పట్ల పలు అనుమానాలు ఉండటంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అమ్మమ్మ మృతి చెందాక ఆమెకు చెందిన 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు, ఆమెకు సంబంధించిన ఆస్తులను తమకు అప్పగించకుండా బెదిరిస్తున్నాడని వారు మొర పెట్టుకున్నారు. మైనర్లు కావడంతో ఎవరికి చెప్పాలో అర్థం కాక మీడియా ముందు కంటతడి పెట్టుకొని మొరపెట్టుకున్నారు. అధికారులు స్పందించి అనాథలుగా ఉన్న తమకు న్యాయం చేసి ఆదుకోవాలన్నారు.

విద్యార్థులకు దేశభక్తి భావం అవసరం



చింతకొమ్మదిన్నె: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థి



ఎర్రగుంట్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పులివెందుల టౌన్ : చిత్ర లేఖనంలో విద్యార్థులు

చింతకొమ్మదిన్నె : విద్యార్థులందరూ దేశభక్తి భావం కలిగి ఉండాలని సీకేదిన్నె గ్రంథాలయ అధికారి ఇబ్రహీం పేర్కొన్నారు. శనివారం సమ్మర్ క్యాంపులో భాగంగా మండల కేంద్రమైన సీకేదిన్నె గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు దేశ భక్తి గేయాలు నేర్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమ తెలివి తేటలను మెరుగు పరుచుకోవాలన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం వేంపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం పిల్లలకు కథనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం ఆర్పీ వరుణ్, లైబ్రేరియన్ కృష్ణ కిశోర్‌రెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు, చిత్రలేఖనం తదితర తరగతులు నిర్వహించారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



చెన్నూరు: ఆలయం వద్ద వేసిన చలువ పందిరి



వేంపల్లె : ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చెన్నూరు: చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారు జామున ఐదు గంటలకు సుప్రభాత సేవ, మూలవిరాట్ విగ్రహానికి అభిషేక పూజలు, అలంకరణ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి భక్తుల కోసం సర్వ దర్శన ఏర్పాట్లు చేశారు. 9 గంటలకు బైక్ ర్యాలీ, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పురవీధుల గుండా స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి కోలాటం బృందం ప్రదర్శన ఉంటుందని వారు వివరించారు.

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లె, లింగాల, తాతిరెడ్డిపల్లె, వెలిదండ్ల, పార్నపల్లె తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా కర్ణపాపాయపల్లె గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహ శోభాయాత్ర ఉంటుందన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవీరాంజనేయ దేవస్థానంలో హనమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్ తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు గణపతిపూజ, చండీ హోమం, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు ఆలయ అర్చకుడు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగాయి. వీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం డ్రైఫ్రూట్స్ అలంకరణలో స్వామివారు దర్శనమివ్వనున్నారు. మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

చక్రాయపేట : చక్రాయపేట మండలంలోని గండి వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా జరిగే శోభా యాత్రను విజయవంతం చేయాలని విశ్వ హిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎస్.చెన్నకృష్ణారెడ్డి, శ్రీవెంకటేశ్వర రాచరాయలస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ రామాంజనేయరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ చక్రపాణిరెడ్డి, కమిటీ సభ్యులు రంగారెడ్డి, ఓబుళరెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులందరికి భోజన వసతి కల్పించామన్నారు.

■ హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం యాగాచార్యులు అనంత శర్మ, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజాస్వామి ఆధ్వర్యంలో త్రికాల ఆరాధన, చతుస్థానార్చన, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.రాఘవేంద్ర ప్రసాద్, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం నడి ఊరి రామాలయం నుంచి ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యదర్శి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు శోభాయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

